
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 28 జూన్ 2023



కోతల 'అమ్మఒడి'

- ఆంక్షల పేరుతో లబ్ధిదారుల సంఖ్య తగ్గింపు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అమ్మఒడి ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు మేనమామగా చదువులకు అయ్యే ఖర్చును తానే భరిస్తానంటూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమ్మఒడి పథకాన్ని తీసుకొచ్చింది. మొదట్లో పెద్దగా ఆంక్షలు పెట్టకపోవడంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అమ్మఒడిని వర్తింపజేశారు. విద్యుత్ బిల్లు 300 యూనిట్ల లోపే, ఇంటి నిర్మాణం 300గజాల లోపు, నాలుగు చక్రల వాహనాలు, 75శాతం హాజరు వంటి ఆంక్షలతో ప్రతి ఏటా అమ్మఒడి లబ్ధిదార్లలో కోత విధిస్తున్నారు. అయితే ఈ ఏడాది కూడా భారీగా అమ్మఒడి లబ్ధిదార్లకు కోతపెడుతోంది ప్రభుత్వం. ఒక్క చిత్తూరు జిల్లాలోనే గత ఏడాదితో పొచ్చితే దాదాపు 4 వేల మంది అమ్మఒడిని కొల్పోనున్నారు.

గత ఏడాదితో పొల్చితే వివిధ ఆంక్షలతో చిత్తూరు జిల్లాలో నాలుగువేల మంది అమ్మఒడి కోల్పోనున్నారు. గతేడాది అంటే 2021-22లో జూన్ మాసంలో 1,56,542మందికి అమ్మఒడి వర్తింపజేస్తూ తల్లుల ఖాతాల్లో రూ.14 వేలు జమ చేశారు. అందులో వెయ్యి రూపాయలు పాఠశాల నిర్వహణ కోసం తిరిగీ తీసుకున్నారు. ఈ ఏడాది 2022-23 విద్యా సంవత్సరానికి 28వ తేదీన విడుదల చేయనున్న అమ్మఒడి లబ్ధిదార్లు 1,52,542 మంది అర్హులుగా తేల్చారు. అంటే గత ఏడాదిలో పోల్చితే నాలుగు వేల మంది అమ్మఒడి లబ్ధిదార్లును తగ్గించారు.


ఈసారి అమ్మఒడి రూ.13వేలే..

అమ్మఒడి పథకం ప్రారంభంలో ఏడాదికి రూ.15 వేలు లబ్ధిదార్ల తల్లుల ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. అందులో పాఠశాల నిర్వహణ ఖర్చుల కోసం వెయ్యి రూపాయలు లబ్ధిదార్లు తిరిగీ పాఠశాల ఖాతాల్లో జమచేయాలని కోరారు. అది కాస్తా గతేడాది రూ. 14 వేలు జమచేసి అందులో వెయ్యి రూపాయలు నిర్వహణ ఖర్చు కోసం తీసేసుకున్నారు. ఈఏడాది పాఠశాల నిర్వహణ ఖర్చుల పేరిట తల్లుల ఖాతాల జమ చేయకముందే కట్ చేసి లబ్ధిదార్ల ఖాతాల్లో రూ.13 వేలు వేయనున్నారు.

ఆంక్షల అమ్మఒడి...

ఏటా అమ్మఒడి లబ్ధిదార్లను కుదించేలా ప్రభుత్వం కొత్తకొత్త ఆంక్షలు పెడుతూ అమ్మఒడి లబ్ధిదార్లను తగ్గించేస్తోంది. దాదాపు 75 శాతం విద్యార్థుల హాజరు తప్పనిసరి, 300 యూనిట్ల లోపు విద్యుత్ వాడకం, నాలుగు చక్రాల వాహనాలుంటే అమ్మఒడి కట్, ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో నెలసరి ఆదాయం రూ.10వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12వేలు, మున్సిపల్ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగులకు మించరాదు. ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరాలి. అర్హత ఉన్న వారు ఏవరైనా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పొందలేకుంటే ప్రతి ఇంటి గడపకు అధికార్లు, సచివాలయ సిబ్బంది వెళ్ళే ప్రభుత్వం నూతన పథకానికి శ్రీకారం చుట్టింది. జూలై ఒకటో తేదీ నుండి ఇంటింటా సర్వేలు చేపట్టనున్నారు. లేనిపోని ఆంక్షలతో అర్హులను అనర్హులుగా ప్రకటిస్తున్న ప్రభుత్వం ఓ మారు ఆలోచించాలని లబ్ధిదార్లు కోరుతున్నారు.

చడీచప్పుడు లేకుండా 'షాక్'



- విద్యుత్ సంస్థల విచ్చలవిడి దోపిడీ
- ప్రతి ఇంటిపై రెండుమూడు రెట్లు భారం
- ఆస్తులు అమ్ముకోవాల్సిందే అంటూ ఆవేదన


పెంచిన కరెంట్ ఛార్జీలు తగ్గించాలని నగరిలో ఏపీఎస్పీడీసీఎల్ ఏఈకి వినతిపత్రం ఇస్తున్న మరమగ్గం కార్మికులు(ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి-తిరుపతి సిటి

అధికారపార్టీ ప్రజలపై మరోసారి విద్యుత్ బారాన్ని మోపింది. విద్యుత్ సంస్థల ద్వారా చడీచప్పుడు లేకుండా అరియర్ చార్జీల పేరుతో విద్యుత్ బిల్లులను రెండు మూడు రెట్లు పెంచి విచ్చలవిడి దోపిడికి తెరలేపింది. చడీ చప్పుడు లేకుండానే... కనీస సమాచారం కూడా ఇవ్వకుండానే భారీ స్థాయిలో బారం మోపి, ప్రజల జేబులకు చిల్లులు వేస్తోంది. విద్యుత్ సంస్థలను అదుపు చేయాల్సిన విద్యుత్ నియంత్రణ మండలి చోద్యం చూస్తూ... డిస్కం తీరు సరైనదే అనేలా వ్యవహరించడం గమనార్హం.

తిరుపతి నగరంలోని సుందరయ్యనగర్‌లో లక్ష్మీ అనే మహిళా ఓ చిన్న ఇంటిలో కాపురం ఉంటోంది. స్థానికంగా బట్టలు ఇస్త్రీ చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఓ తోపుడు బండిలో బొగ్గు ఇస్త్రీ పెట్టిని నమ్ముకుని రోజుకు 200, 300 సంపాదిస్తూ జీవనం గడుపుతోంది. ప్రతి రోజూ ఉదయాన్నే 6 గంటలకు ఇంటి నుంచి వెళ్లి రాత్రి 10 గంటలకు ఇంటికి వస్తోంది. రాత్రి కేవలం 8 గంటలు మాత్రమే ఇంటిలో ఉంటుంది. అది కూడా నిద్రపోవడానికి మాత్రమే. ఆ ఇంటిలో ఒక లైటు, ఫ్యాన్ మాత్రమే ఉన్నాయి. ప్రతి నెల ఆమెకు 150 రూపాయలు విద్యుత్ బిల్లు వచ్చేది. మే నెలలో ఏకంగా రూ.1028 రూపాయలు విద్యుత్ బిల్లు వచ్చింది. సుమారు ఏడు రెట్లకుపైగా బారం వేశారు. సంపాదన మొత్తం విద్యుత్ బిల్లుకే వెచ్చించాల్సిన పరిస్థితి. ఇది ఆమె ఒకరి పరిస్థితే కాదు. పట్టుమని పది అడుగుల విస్తర్ణం కూడా లేని చిన్నగదికి రూ.1200 విద్యుత్ బిల్లులు వేయడం శోచనీయం. సుందరయ్య నగర్‌లోని డోర్ నెంబరు 19.6.42 గల చిన్న ఇంటిలో మల్లికార్జున తన కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. గతంలో ఈ ఇంటికి 350 రూపాయలు విద్యుత్ బిల్లు వచ్చేది. ఈ నెల 1258 రూపాయలు రావడం గమనార్హం. లలిత అనే ఆమె నివశించి రేకుల షెడ్‌లో ఒక ప్యాన్, లైటు, టివి మాత్రమే ఉన్నాయి, దీనికి నెలకు 300 రూపాయలు మించకుండా బిల్లు వచ్చేది. ఈ నెల ఏకంగా 800 రూపాయలు వేశారు. ఇలా ఒకటి, రెండు కాదు. కాలనీలోని అన్ని ఇళ్లకు గతంతో పోల్చితో రెండు నుంచి మూడు రెట్లు అధికంగా మే నెల విద్యుత్ బిల్లుల రావడం విడ్డూరం. రేణిగుంట మండలం కృష్ణాపురం నివాసం ఉండే నాగరాజుకు నెలకు రూ.300 విద్యుత్ బిల్లు వచ్చేది. మే నెలలో రూ.1126 రావడం గమనార్హం. ఇలా ఒక ఏరియా, ప్రాంతంలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా ఉంటున్న అన్ని ఇళ్లకు ఇదే విధంగా విద్యుత్ బిల్లు వచ్చాయి. 2015 నుంచి 19 వరకు వాడిని విద్యుత్ బిల్లులకు సైతం అదనపు చార్జీల పేరుతో అరియర్స్ అంటూ రెండు నుంచి మూడు రెట్లు చార్జీలు పెంచడం శోచనీయం. వేసవి కాలం కావడంతో అధిక మోతాదులో విద్యుత్ వినియోగించి ఉంటాం అందుకే చార్జీలు పెరిగాయని వినియోగదారులు బావిస్తారనే ఉద్దేశంతో చడీచప్పుడు లేకుండా విద్యుత్ సంస్థలు ఈ విధంగా బారాలు మోపాయి. వినియోగదారులు తమ ఆవేదన ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి. బియ్యం, నిత్యవసర వస్తువులు లేకపోయిన ఓ పూట ఉండగలరు, విద్యుత్ అనేది అనునిత్యం ప్రజలకు అత్యంత అవసమైంది. ఈ నేపథ్యంలో విద్యుత్ సంస్థలు ఎంత బారాలు వేసిన, తప్పని సరి పరిస్థితులో చెల్లిస్తారని డిస్కంల ధీమా. ఈ విద్యుత్ బారాలపై సిపిఎం, వామపక్షాలు స్పందించి ఇంటింట విద్యుత్ బిల్లుల సర్వే చేపట్టడంతో విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ సంస్థలు పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించి, వినియోగదారులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

పొదుపు సంఘాలకు రుణాలు ఇవ్వండి

డిఆర్‌డిఎ పీడీ తులసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మహిళా సంఘాలకు రుణాలు అందించడంలో బ్యాంకులు సహకారం ఉండాలని డిఆర్‌డిఏ పిడి డిఏంకె తులసి తెలిపారు. మంగళవారం జెఏంఎల్ బిసి సమావేశం డిఆర్‌డిఎ సమావేశపు మందిరంలో నిర్వహించారు. పిడి మాట్లాడుతూ సంఘం పొదుపులు పూర్తిగా వినియోగించుకోవడానికి బ్యాంకులు సహకరించాలని, సంఘ సభ్యులకు వ్యక్తిగతంగా జీవనోపాధులు చేసే మహిళలకు రుణాలు ఇప్పించాలన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు బ్యాంకు మేనేజర్లు సహకరించాలని కోరారు. ఎల్‌డిఏం హరీష్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు జగనన్న తోడు, మహిళా సంఘాలకు ఆర్థిక సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు, మండల ఏపిఎంలు హాజరైనారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పిడి తులసి

10 కిలోమీటర్లు.. పడుతూ.. లేస్తూ..!

- అంతర్రాష్ట్ర రహదారిలో వాహనదారుల ఇక్కట్లు
- పట్రపల్లి వద్ద గుంతల్లో కూరుకుపోయిన లారీ
- కిలో మీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు


రోడ్డులోని గుంతలో ఇరుక్కుపోయిన లారీ

ప్రజాశక్తి- యాదమరి: 10 కిలోమీటర్ల మేర ప్రయాణించాలంటే... పడుతూ... లేస్తూ... వాహనదారులు ప్రయాణించాల్సిందే... ఆ రహదారిలో వాహనదారులు ఇక్కట్లు వర్ణాతీతం ఇటీవల కురిసిన వర్షాలకు చిన్న చిన్న గోతులు పెద్ద పెద్ద గోతులుగా తయారైంది. మంగళవారం ఆ గోతుల్లో లారీ ట్యాంకరు కూరుకుపోయింది. దీంతో చిత్తూరు- గుడియాత్తం జాతీయ రహదారిలో కిలోమీటర్ల కొద్ది వాహనాలు రోడ్లపై నిలిచిపోయింది. చిత్తూరు- గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి జిల్లా కేంద్రం దగ్గరున్న యాదమరి మండల కేంద్రం జోడి చింతల నుంచి తమిళనాడు సరిహద్దు కనికాపురం వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంతో అధ్వానంగా తయారైంది. పది కిలోమీటర్ల మేర ఆరడుగుకో గుంత వాహనచోదకులు దారి గుండా ప్రయాణించాలంటే బెంబేలెత్తిపోతున్నారు. ముందుకు సాగలేక.. వెనుక్కు రాలేక... నానా అవస్థలు పడుతున్నారు. జోడిచింతల వద్దనున్న పోలీస్ స్టేషన్ నుంచి తమిళనాడు సరిహద్దు కనికాపురం వరకు అడుగుకోగుంత.

ఈ రహదారిలో ప్రయాణించాలంటే వాహనదారులు చాలా తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిత్తూరు గుడియాత్తం తమిళనాడుకు వెళ్లే అంతరాష్ట్ర రహదారిలో నిత్యం వందల సంఖ్యలో లారీలు ఇతర వాహనాలు రాకపోగులు సాగిస్తున్నాయి అయితే ఈ రహదారి మూడేళ్ల నుండి మరమ్మతులు నోచుకోకపోవడంతో గుంతల మయంగా తయారైంది. ఈదారిలో ప్రయాణించాలంటే వాహనదారుల తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరి కొంతమంది కాట్పాడి మీదుగా వెళ్లి గుడియాత్తం చేరుకుంటున్నారు. వాహనదారులు ప్రతిరోజు ఈ దారిలో ప్రయాణించడమంటే ఓ సాహసమే చేస్తున్నారు. ప్రతి నిత్యం పలువురు వాహనదారులు ప్రమాదాలను భారినపడుతూ గాయాల పాలవుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని మండల సర్వసభ్య సమావేశాల్లో అధికారులు నిలదీసిన, ఆర్ అండ్ బి అధికారులకు వినతిపత్రాలు, ప్రతినిధులను కలిసిన ఎవరూ పట్టించుకోని పాపానపోలేదు. దీంతో ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు అఖిలపక్షం నేతలు నిరసన వ్యక్తం చేస్తూ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. రోడ్డు మొత్తం పూర్తిగా గుంతలమయం కావడంతో వచ్చే దుమ్ము, ధూళి వలన వెనకాల వాహనాలకు రోడ్డు మార్గం సరిగా కనిపించక ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇక రాత్రి సమయాల్లో చెప్పనక్కర్లేదు. ప్రతిరోజు వాహనదారులు తమ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొన్నది. అటు ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు ప్రేక్షకపాత్రకు మాత్రమే పరిమితం అవుతున్నారని వాహనదారులలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా ఈ రోడ్డు ఎప్పటికి మరమ్మతులు చేపడతారో అని వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

4న సిఎం పర్యటన

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జులై 4న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ ముఖ్యమంత్రి పర్యటన ముందస్తు ఏర్పాట్లలో భాగంగా అవసరమైన బహిరంగ సభ, హెలిప్యాడ్ నిమిత్తం పోలీస్ పెరేడ్ గ్రౌండ్, మెసానికల్ గ్రౌండ్‌లను జిల్లా ఎస్పీ వై.రిశాంత్ రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తో కలసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ముందస్తు ఏర్పాట్లలో భాగంగా బహిరంగ సభ పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో హెలిపాడ్ మెసానికల్ గ్రౌండ్‌లో ఏర్పాటును పరిశీలించి, గంగినేని చెరువు, వాహనాల పార్కింగ్‌కు అనువైన ప్రదేశాలను కలెక్టర్, ఎస్పీ, జేసి పరిశీలించారు. అలాగే విజయ డెయిరీలో జరుగుతున్న ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాటు కట్టుదిట్టంగా చేయాలని అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్, విఐపి వెహికల్స్ పార్కింగ్, ముఖ్యమంత్రి పర్యటనకు రూట్‌మ్యాప్‌లో గుర్తించిన ప్రాంతాలలో, పార్కింగ్ ప్రదేశాల్లో బ్యారికేడింగ్, ర్యాంపుల ఏర్పాటు, హెలిప్యాడ్ ఏర్పాటుకు అవసరమైన పనులను వెంటనే ప్రారంభించాలని పీఆర్, ఎస్ఈని కలెక్టర్ ఆదేశించారు. పర్యటనలో పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పి సిఈఓ ప్రభాకర్ రెడ్డి, చిత్తూరు ఆర్డీఓ రేణుక, చిత్తూరు తహశీల్దార్ కిరణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటించే ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పరిశీలించిన కమిషనర్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్ రెడ్డి నగరంలో పర్యటించే ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ నగరపాలక అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాలైన విజయ డెయిరీ పరిసరాలు, పీవీకేఎన్ కళాశాల రోడ్డు, మెసానిక్ మైదానం రోడ్డు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి జరుగుతున్న పనులను పరిశీలించారు. విజయ డెయిరీ, పీవీకెఎన్ కళాశాల వద్ద రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలను పూర్తిస్థాయిలో తొలగించి అంతా శుభ్రంగా ఉండాలన్నారు. అనధికార నిర్మాణాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలను పూర్తిగా తొలగించాలన్నారు. రోజువారి పారిశుధ్య కార్యక్రమాలకు సంబంధించి యాక్షన్‌ప్లాన్ ప్రకారం పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. సీఎం పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన పనులపై ప్రజారోగ్య విభాగం, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ, టీపీవో మురళీకష్ణ పాల్గొన్నారు.


సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

శ్మశానాల ఏర్పాటుకు స్థలాలను సేకరించండి


దళితవాడలో శ్మశానాల ఏర్పాటుపై రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో అవసరమైన చోట్ల శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ నుంచి డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌తో కలిసి ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో అవసరమైన చోట్ల శ్మశాన వాటికల ఏర్పాటు, 22ఏ, ఏపీ సేవ- మీసేవ, రీసర్వేపై ఆర్డీఓలు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, డిఐఓలు వీఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ గ్రామాలలో అవసరమైన చోట్ల శ్మశాన వాటికలకు సంబంధించి భూములను పరిశీలించి వెంటనే ఎస్సీ,ఎస్టీ గ్రామాలకు అందజేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. ఇంకా కొన్ని మండలాల పరిధిలో గ్రామాల్లో పెండింగ్ ఉన్నాయని వాటిని కూడా జులై మూడో తేదీ నాటికల్లా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. 22 ఏ కేసులకు సంబంధించి ఆన్‌లైన్‌లో పెండింగ్ లేకుండా వెంటనే పూర్తిచేయాలని తహశీల్దార్లను, ఏపీ సేవలు మీ సేవలకు సంబంధించి ఎక్కడ కూడా పెండింగ్ లేకుండా అన్నిటిని జీరో చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మీసేవ ఏపీ సేవలకు సంబంధించిన కేసులను మండల సర్వేయర్లు, డీఐవోలు త్వరగా పూర్తి చేయాలన్నారు. డిఎల్ఆర్‌సి (డిస్ట్రిబ్యూట్ ల్యాండ్ రిజిస్టర్స్)కి సంబంధించి ఇంకా 105 గ్రామాల్లో పెండింగ్ ఉందని, జూన్ నెల ఆఖరుకు 70 గ్రామాల్లో డిఎల్ఆర్ పూర్తి చేయాలని లక్ష్యం కాగా ఇప్పటివరకు 40 గ్రామాల్లో మాత్రమే పూర్తి చేశారని, మిగిలిన గ్రామాల్లో కూడా ఈ నెల ఆఖరి కల్లా పూర్తి చేయాలని సంబంధిత తహశీల్దార్‌లను ఆదేశించారు. డీఎల్ఆర్ పెండింగ్‌లో ఉన్న గ్రామాలను కూడా మూడు రోజుల్లోగా పూర్తిచేసి రిపోర్టును జిల్లా కలెక్టరేట్‌కు పంపించాలని మండల సర్వేలను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సర్వే భూమి అండ్ రికార్డ్స్ ఏడి గౌస్‌బాషా, మురళి, వాసు, పద్మజ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, గిరి, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మేకల పెంపకందార్లకు

నాబార్డు రుణాలు ఇవ్వాలి

సొసైటీ అధ్యక్షులు వాడ గంగరాజు


సమావేశంలో మాట్లాడుతున్న వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా గొర్రెల, మేకల పెంపకందార్ల సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశం జిల్లా అధ్యక్షులు ప్రకాష్ యాదవ్ అధ్యక్షతన చిత్తూరు సహకార యూనియన్ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సమావేనికి హాజరైన లక్ష్మీ వెంకటేశ్వర గొర్రెల, మేకల పెంపకం దార్ల సొసైటీ అధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ నేషనల్ కోపరేట్ సహకార అభివద్ధి సంస్థ (ఎన్‌సిడిసి) వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లాలో గొర్రెల, మేకల పెంపకందార్లు అనేక సమస్యలుతో ఇబ్బందులు పడుతున్నారని వీరిని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ప్రతి సంవత్సరం మూడుసార్లు నట్టల నివారణ మందులు వేయాల్సి ఉన్నప్పటికీ వెయ్యడం లేదన్నారు. గతంలో గొర్రెలు మేకలు ప్రమాదవసాత్తు మతి చెందినా, జబ్బుపడి మతి చెందనా ఉచిత ఇన్సూరెన్సు ద్వారా ఒక్కో జీవానికి రూ.6వేలు నష్టపరిహారం ఇచ్చే వారిని, ఇది పెంపకందారులకు ఉపయోగకరంగా ఉండేదన్నారు. కానీ ప్రస్తుతం ప్రతి జీవానికి రూ.36వేలు చెల్లించాలని, ట్యాగ్‌లు వేసుకోవాలని నిర్ణయం చేయడం అంటే పెంపకందార్లుకు అన్యాయం చేయడమేనన్నారు. గ్రామాల్లో చెరువులు, కాలువులు, గట్లు కొంతమంది ఆక్రమించుకొని గడ్డిమొక్కలు వేయడంతో గొర్రెలు, మేకలు మేపుకునేందుకు మేతస్థలాలు కరువయ్యాయన్నారు. జీవో 559, 1019ల ప్రకారం బీడి భూములను పెంపకందారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొంత మంది రైతులు గొర్రెలు, మేకలు పెంచుకుని జీవించడానికి ప్రభుత్వం నుండి ఎటువంటి రుణసౌకర్యం లేదని, గతంలో ఇచ్చిన ఎన్‌సిడిసి రుణాలు ఈప్రభుత్వం వచ్చాక ఇవ్వలేదన్నారు. పక్క రాష్ట్రం తెలంగాణ లో 75శాతం సబ్సిడీతో రుణాలు ఇస్తున్నారన్నారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గొర్రెలు మేకల పెంపకందార్లు ఆదుకుంటామన్నారు కానీ ఏ ఒక్క పథకం మన పెంపకందారులకు చేపట్టలేదని తెలిపారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి పెంపకందారులకు పింఛన్లు ఇచ్చే ఆదుకోవాలని అన్నారు. సహకార సొసైటీలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని దీనిని మానుకొని లక్షలాది మంది సొసైటీ సభ్యులుగా ఉన్న సొసైటీలను బలోపేతం చేయాలని తెలిపారు. జిల్లా పర్యటన సందర్భంగా జిల్లాలోని పెంపకందారులకు సంబంధించిన సమస్యలపై ప్రకటన చేయాలని తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్రచైర్మన్ ప్రకాష్ యాదవ్, పశుసంవర్ధక శాఖ జెడిలకు వినతి పత్రం అందించారు.

విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా

30న డీఈ ఆఫీసు ఎదుట ధర్నా

రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్షం పిలుపు


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి- పలమనేరు: జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలకు, ట్రూఆఫ్ ఛార్జీలకు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఈనెల 30వ తేదీన ఏపీఎస్ డిసిఎల్ డీఈ కార్యాలయం వద్ద అఖిలపక్షం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నాకు పిలుపునిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపిందని ఆరోపించారు. మంగళ వారం సిపిఐ, సిపిఎం, అఖిలపక్షం నాయకత్వంలో రౌండ్‌టేబుల్ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఈశ్వర్ అధ్యఓతన జరిగింది. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్తా, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మద్దెల సుబ్రమణ్యం, కెవిపిఎస్ మండల కార్యదర్శి గుర్రం సుబ్రహ్మణ్యం, ఐద్వా పట్టణ కార్యదర్శి జయంతి, భవన నిర్మాణసంఘం నాయకులు రాజా, లక్ష్మయ్య, సంజయ్ ప్రసంగించారు. వారు మాట్లాడుతూ... వైయస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు పాదయాత్రలో విద్యుత్ ఛార్జీలు పెంచనని, ప్రజలపైన భారాన్ని మోపమని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాల కాలంలో ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే ధక్కుతుందని ధ్వజమెత్తారు. 2019 నుండి నేటి వరకు సర్దుబాటు ఛార్జీల పేరుతో అదనపు ఛార్జీలను వసూలు చేస్తూ సామాన్య, మధ్యతరగతి ప్రజలను దగా చేయడం దుర్మార్గమన్నారు. ఉన్న మీటర్లు చాలదని స్మార్ట్ మీటర్ల పేరుతో ఐదుకోట్ల మంది ప్రజల్ని మోసం చేయడానికి కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, ట్రూఆఫ్ చార్జీలను రద్దు చేయాలని, ఇంటింటికి స్మార్ట్ మీటర్లను పెట్టడాన్ని విరమించుకోవాలని అఖిలపక్ష పార్టీ నాయకులు ప్రజాసంఘం నాయకులు డిమాండ్ చేశారు. 30వ తేదీన పట్టణంలోని ఏపీఎస్ డీసీఎల్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పలమనేరు ప్రజలు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

పాత పనులు ప్రారంభించండి



ప్రజాశక్తి-పుంగనూరు: మున్సిపాలిటీలో టెండర్లు జరిగి ఏళ్లు తరబడుతున్నా పనులు ప్రారంభించక పోవడం ఏమిటని, వారి సమస్యలు ఏమిటో తెలుసుకోవాలని కౌన్సిలర్ త్యాగరాజు సమావేశం దృష్టికి తెచ్చారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఛైర్మన్ అలీమ్ భాషా అధ్య క్షతన జరిగింది. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రతి సమావేశంలోనూ అభివద్ధి పనులు అంటూ టెండర్లు నిర్వ హిస్తున్నారు కానీ వేసిన టెండర్లకు పనులు జరగడం లేదని చెప్పారు. కాంట్రాక్టర్ సమస్యలు ఏమైనా ఉంటే తెలుసు కోవాలని తెలిపారు. టెండర్లు జరిగిన పనులను సీనియారిటీ ప్రకారం జరిపించాలని కోరారు. దీనిపైన స్పందించిన కమిషనర్ నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ కాంట్రాక్టర్‌తో మాట్లాడి వేసిన టెండర్లన్నింటికీ పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఛైర్మన్ హలీం భాష మాట్లాడుతూ పట్టణానికి రూ.కోటి విలువచేసే ఈ వాహనాలు వచ్చాయని, వాటిని త్వరలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం టెండర్లు వేసిన పనులకు నిధులను డిపాజిట్ చేసినట్లు పనులను నాణ్యంగా, వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామ న్నారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా పట్టణంలో ప్రజ లకు రోజూ నీళ్ల వదిలేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని శాని టరీ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. 26వ వార్డు కౌన్సిలర్ భారతి మాట్లాడుతూ మా వార్డులో శానిటేషన్ సమస్య ఉందని అధికారులకు గతంలో పలుసార్లు చెప్పినా అంతంత మాత్రంగానే స్పందిస్తున్నారని చెప్పారు. విద్యుత్ పోల్స్ కూడా అక్కడక్కడ ఏటవాలుగా ఉన్నాయని వాటిని సరిచేసి ఎలాంటి సమస్య లేకుండా చూడాలన్నారు. అజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదం తెలుపు తున్నట్టు కౌన్సిలర్‌కి జర్ భాష పేర్కొన్నారు.

సమావేశానికి హాజరుకాని కౌన్సిలర్లు

మున్సిపాలిటీలో జరిగిన కౌన్సిల్ ప్రత్యేక సమావేశానికి కొంతమంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. వీరు సమావేశానికి హాజరు కాకపోవడంతో పలు విమర్శలు వినిపించాయి. గైర్హాజరైన కౌన్సిలర్లు వార్డుల్లో పనులు కల్పించలేదు అనే అసంతప్తా లేక వేరే సమస్యలు ఉన్నాయా అంటూ కౌన్సిలర్లు చర్చించుకోవడం విశేషం.

మీడియాకు అజెండా కాపీలు ఇవ్వని వైనం

మున్సిపాలిటీలో ప్రతినెలా జరిగే కౌన్సిల్ సమావేశానికి మీడియాను ఆహ్వానిస్తూ అజెండా కాపీలు ఇస్తారు. అయితే ఇటీవల జరిగే కౌన్సిల్ సమావేశం అజెండాలు ఇవ్వకుండా సమావేశం జరుగుతుందని తెలుపుతున్నారు. కారణాలు తెలియడం లేదు. కౌన్సిల్ సమావేశంలో వైస్ ఛైర్మన్‌లు కొండవీటి నాగేంద్ర, సిఆర్ లలిత, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ డీఈ, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: జగనన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలం కార్యాలయంలో మండల పరిధిలోని సచివాలయాల సిబ్బందితో సచివాలయాల వారీగా ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో లబ్ధిదారులకు మంజూరైన గహాల నిర్మాణాలు చేసేలా, అవసరమైన ఆర్థిక సాయంను స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకులతో అందించాలన్నారు. స్టేజి కన్వర్షన్ కచ్చితంగా జరిగేలా, పనుల్లో పురోగతి ఉండాలని ఆ దిశగా అధికారులందరూ పనిచేయాలన్నారు. మండలంలో మొత్తం 3184 ఇళ్లు మంజూరు కాగా 119 ఇళ్ల స్టేజ్ కన్వర్షన్ జరిగిందని హౌసింగ్ అధికారులు ఆయనకు వివరించారు. సచివాలయాల వారీగా గహనిర్మాణ పురోగతి తక్కువగా ఉండటంతో సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ పద్మనాభం, డీఈ సుబ్రహ్మణ్యం, ఏఈ గుణశేఖర్ రెడ్డి, తహశీల్దార్ బెన్‌రాజ్, ఎంపీడీఓ మధు సూదన్ రెడ్డి, సంబంధిత అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



ప్రజాశక్తి-వి.కోట: సమస్యల పరిష్కారమే గడపగడప లక్ష్యమని పలమనేరు ఎమ్మెల్యే వెంకటే గౌడ తెలిపారు. మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా యాలకల్లు పరిధిలోని తిమ్మరాజు పల్లి, వెర్రి నాగేపల్లి, కేపీ బండ గ్రామాలలోని ప్రతి గడపను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ప్రజలకు అందుతున్న వివిధ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. గ్రామాల్లో మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి గడప తొక్కాలని లక్ష్యంతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి కలిగేలా చూడాల్సిన బాధ్యత గ్రామ సచివాలయ ఉద్యోగులదని హెచ్చరించారు. పింఛన్లు, నూతన పక్కా గహాలు, సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు మంజూరు, చేయూత తదితర పథకాలపై ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.యువరాజు, సర్పంచ్ బషీర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ హేమంత్ రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మణ రెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ రాములు రెడ్డి, జెసియస్ మండల కన్వీనర్ కిషోర్ గౌడ, మండల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా ఉత్తరా నక్షత్ర పూజలు



ప్రజాశక్తి-నగరి: పట్టణ పరిధి బైపాస్ కూడలి సమీపంలోని శ్రీ ధర్మ శాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం అయ్యప్ప స్వామి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప పాటల భజనలు, అర్చన మంత్రాలను అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు ఉచ్చరిస్తూ భజనలు చేయడంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు ప్రేమలత, కపానిధి, సత్య, రమేష్ ఉభయదారుగా వ్యవహరించారు. కార్యక్రమంలో గురుస్వామి మురళి, భక్తులు కన్నప్ప, మునస్వామి, రమేష్ బాబు, దుర్గాప్రకాష్ స్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని గంద్రాజుపల్లి గ్రామంలో తాగునీటిపైపు కేబుల్ వైర్లు చోరీ కావడంతో రెండు రోజులుగా తాగునీటికి వ్యవసాయ బావులను గ్రామస్తులు ఆశ్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ మల్లికార్జున్ స్పందించి వెంటనే తన సొంత నిధులతో కేబుల్ వైరుకొని తనే దగ్గరుండి బోరు మరమ్మతులు పూర్తిచేసి గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గతంలో ఇలా మూడు పర్యాయాలు కేబుల్ వైరు చోరీకి గురైందని, ఈ సమాచారాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల్లో సైతం ఈ మధ్యకాలంలో రైతుల బోరు మోటార్ల కేబుల్ వైర్లు చోరీ కావడం మామూలు అయిపోయిందని, పోలీసులు చోరీలపై నిగా పెట్టి అరికట్టాలని ఆయన పేర్కొన్నారు.

నాడు-నేడు పనుల తనిఖీ



ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఆవులపల్లె పంచాయతీ కలమందలవారి పల్లె గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు అభివద్ధి పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటేశ్వర్లు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, వేగవంతంగా చేయాలని తెలిపారు. ఈ పనులను పాఠశాల సిబ్బంది నిత్యం పర్యవేక్షణ చేస్తూ ఉండాలని కోరారు. కార్యక్రమంలో జేఈ అనూష, ప్రధానోపాధ్యాయులు భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడానికే సచివాలయ వ్యవస్థ



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ప్రజల వద్దకు ప్రభుత్వం ద్వారా సేవలందించడానికి ప్రవేశ పెట్టిందే సచివాలయం వ్యవస్థ అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మంగళవారం గంగాధర నెల్లూరు మండల పరిధిలోని కడప గుంటలో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రజలకు నవరత్నాలు ద్వారా వాలంటీర్లతో పెన్షన్‌ను లబ్దిదారులు ఇంటి వద్దకు వెళ్లి అందజేస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్ రెడ్డికి చెల్లిందన్నారు. జూలై 1 నుంచి 30వ తేదీ వరకు జగనన్న సురక్ష పథకంతో ప్రజలకు కావలసిన అన్ని రకాల సేవలను అందించడానికి రూపొందించిన పథకంతో పరిష్కరించుకోవడానికి ప్రజలకు ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డిని ఎవరు విమర్శించినా తిరిగి తాను ప్రతి విమర్శ చేయడానికి వెనకాడే ప్రసక్తే లేదన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ కార్యక్రమాల అమలుపై కుల మతాలకతీతంగా ప్రజలు సంపూర్ణ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారని తాను గడపగడపకు ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు సీఎం జగన్మోహన్ రెడ్డి తమకు అన్ని రకాల పథకాలు అందజేస్తున్నారని సంతోషంగా తెలుపుతున్నారన్నారు. సమావేశంలో కడప గుంట సర్పంచ్ బుజ్జి, ఎంపీటీసీ ఉమా మహేశ్వరి, మండల పార్టీ కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, మాజీ వైసీపీ కన్వీనర్ సురేందర్ రెడ్డి, మండల వైస్ ఎంపీపీ హరిబాబు, పెనుమూరు మార్కెట్ కమిటీ అధ్యక్షులు కమలాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు



ప్రజాశక్తి-పాలసముద్రం: మండల పరిధిలోని ప్రజలకు కులం, మతం, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్దిదారులకు సక్రమంగా అందించాలని ఎంపీపీ శ్యామల, జడ్పీటీసీ సభ్యులు అన్నులగం తెలిపారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రేమ్ రాజ్ కుమార్ సమక్షంలో సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జనరంజన పాలన అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హత ప్రామాణికంగా రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ లబ్ధ చేకూర్చాలని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడుతున్నారనే ఉద్దేశంతో గ్రామ సచివాలయ వ్యవస్థలు తీసుకొచ్చారని తెలిపారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేసి మండల అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్రతి పంచాయతీలో మినరల్ వాటర్ ప్లాంట్ భవనాలు నిర్మించి ఇస్తే, వాటర్ ఉచితంగా బెంగళూరు వాసులు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అన్నులగం, పెనుమూరు మార్కెటింగ్ ఛైర్మన్ బండి కమలాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, పుష్ప, పీహెచ్‌సీ కమిటీ ఛైర్మన్ ఎస్ శివప్రకాశరాజు, సర్పంచ్ గాలి మహేష్ బాబు, శిబా, జీవిత, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని మరింతగా అభివృద్ధి చేద్దాం: మేయర్



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరాన్ని మరింతగా అభివద్ధి చేద్దామని నగర మేయర్ అముద పిలుపునిచ్చారు. చిత్తూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం నగర మేయర్ ఎస్. అముద అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో కమిషనర్ జె.అరుణ, డిప్యూటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్ కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకొని నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని వార్డులో అభివద్ధి పనులు చేపట్టాలన్నారు. గుత్తే దారులు వీలైనంత ఎక్కువ పనులు చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ జిజిఎంపీ, 15వ ఆర్థిక సంఘం నిధులు అందుబాటులో ఉన్నాయని, ఈ నిధులు సద్వినియోగం చేసుకొని పనులు చేపట్టాలన్నారు. అనంతరం పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. అజెండా అంశాల్లో భాగంగా వార్డు కార్పొరేటర్లు వారి డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి ఇచ్చిన ప్రతిపాదనలను ఆమోదించారు. సమావేశంలో ప్రారంభంలో గత ప్రభుత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరిగాయని టిడిపి కార్పొరేటర్ చెప్పడంతో వైసిపి కార్పొరేటర్లు అడ్డుకున్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రజాసంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వాదనకు దిగారు. నగర మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్లు సర్దిచెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలో కూరగాయల మార్కెట్, ఎన్టీఆర్ బస్టాండ్, శ్రీకాసు బ్రహ్మానంద రెడ్డి బస్టాండ్, జంతు వధశాలకు సంబంధించి 2023-24 ఆర్థిక సంవత్సరం సంబంధించి వసూలు చేయుటకు నిర్వహించిన వేలంపాటలో హెచ్చుపాటదారుకు కేటాయించడానికి ఆమోదించారు. చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో క్యాంటీన్ ఏర్పాటుకు, తిమ్మసముద్రం రెవెన్యూ గ్రామ సర్వేనెంబర్ 475/19లోని రెండు ఎకరాల భూమిని స్కిల్ డెవలప్మెంట్ కళాశాల స్థాపన కోసం ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ వారికి బదలాయించడానికి ఆమోదించారు. అనాధల వసతి గహంలో (నైట్ షెల్టర్) నిర్వహణ ఖర్చుకు, మురుగానపల్లి ప్రధాన రహదారి నుండి సిసి రోడ్ నిర్మాణానికి టెండర్లు దక్కించుకున్న వారికి పని ఉత్తర్వులు మంజూరు చేయడానికి, నగరపాలక సంస్థ ద్వారా పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సంబంధించి కొండారెడ్డిపల్లి పూల మార్కెట్ వద్ద, సంతపేట వద్ద స్థలం కేటాయించడానికి ఆమోదించారు. సమావేశంలో నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలి: డిఆర్‌ఓ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఓటరు జాబితా తయారు చేయడంలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా సిద్ధం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి యన్.రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రత్యేక సవరణ రివిజన్-2024, (ఎస్ఎస్ఆర్-2024) ప్రీరివిజన్ యాక్టివిటీస్, రివిజన్ యాక్టివిటీస్‌పై ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఈడీటీలకు శిక్షణా తరగతుల నిర్వహణపై తహసీల్దార్లు, ఎన్నికల డిటిలు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బిఎల్ఓలకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఓటర్ జాబితా తయారు చేసేటప్పుడు అతి ముఖ్యమైన వ్యక్తులు, ప్రముఖుల పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో, లేవోని జాగ్రత్తగా వెరిఫికేషన్ చేయాలని బిఎల్ఓలకు సూచించారు. జిల్లాలో ఇంకా 15 వేలు క్లైయిమ్స్ పెండింగ్‌లో ఉన్నాయని వాటిని కూడా వెరిఫికేషన్ చేసి వెంటనే పూర్తిచేయాలన్నారు. జులై 21 నుంచి ఆగస్టు 20వ తేదీ వరకు బిఎల్ఓలు ప్రతి ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. ఫారం-6 ద్వారా కొత్తగా ఓటరు నమోదు చేయాలని, ఫారం-7 ద్వారా మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలిగించాలన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటరు గా నమోదు చేయించాలన్నారు. ఎలక్షన్స్‌కు సంబంధించి ప్రతి మండలానికి ఒక డేటా ఆపరేటర్‌ను ఇచ్చున్నామని, బిఎల్ఓలకు క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే డేటా ఆపరేటర్ ద్వారా పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఓటర్ జాబితాలో కొంత మంది ఓటరు ఐడి కార్డులో ఫొటోస్ సరిగా లేనివాటిని మార్పించాలని ఆదేశించారు.

ఎస్ఐ పరామర్శ




ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: ఐ న్యూస్ జర్నలిస్టు ఎంజీఆర్ తండ్రి మునస్వామి శనివారం మతిచెందారు. ఈ సమాచారం తెలుసుకున్న కాణిపాకం ఎస్ఐ శ్రీనివాసరావు మంగళవారం ఐ న్యూస్ జర్నలిస్టు ఎంజీఆర్ కుటుంబ సభ్యులను జీడి నెల్లూరులోని వారి ఇంటి వద్ద పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి వారిలో ధైర్యాన్ని నింపారు. వైస్ ఎంపీపీ హరిబాబు, వైసీపీ నేత జగన్ బాబు, ఎస్బి సిబ్బంది కిరణ్ పాల్గొన్నారు.

కోలాహలంగా ముత్యాలమ్మకు పొంగళ్లు

ప్రజాశక్తి-పెనుమూరు: గంగమ్మ జాతరలో భాగంగా మండలంలోని ఏనుగుకొండయ్య పల్లె గ్రామస్తులు మంగళవారం పెనుమూరు గ్రామదేవత ముత్యాలమ్మకు కోలాహలంగా పొంగళ్ళు తెచ్చారు. ఆలయ ఆవరణలో పొంగళ్ళు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పిండి దీపాలు వెలిగిం చారు. జాతర సందర్భంగా సత్యమ్మ, గంగమ్మకు పూజలు చేపట్టారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఉపాధ్యాయ బదిలీల విషయంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారిని ఎపిటిఎఫ్ నేతలు గోపినాథం, ముక్తార్ అహ్మద్, ప్రకాష్‌లు కలిసి వినతిపత్రం అందజేశారు. బదిలీల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులు ఆయా ప్రాంతాల్లో ఖజానా కార్యాలయాల్లో జీతాలు పొందేలా చూడాలని కోరారు. అప్‌గ్రేడ్ పొందిన ఉపాధ్యాయులకు జీతాల సమస్య లేకుండా చూడాలన్నారు.



నియామకం



ప్రజాశక్తి-పుంగనూరు: రాయల్ పీపుల్ ఫ్రంట్ యూత్ వింగ్ కన్వీనర్‌గా హేమంత్ కుమార్ రాయల్‌ను నియమించినట్లు మంగళవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీపుల్ ఫ్రంట్ అధ్యక్షులు రెడ్డి శేఖర్ రాయల్, పుంగనూరు నియోజకవర్గ రాయల్ పీపుల్ ఫ్రంట్ యూత్ వింగ్ కన్వీనర్, ఇన్‌ఛార్జ్‌గా తనను నియమించినట్లు చెప్పారు. నాపై నమ్మకంతో ఈ పదవిని అప్పజెప్పిన అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లో రాయల్ పీపుల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

క్రీడా సామాగ్రి వితరణ



ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు పలమనేరు పట్టణానికి చెందిన శ్రీపురం సీతారామయ్య రూ.25 వేల క్రీడా సామాగ్రిని వితరణ చేసినట్లు తెలుగు సాహిత్య సాంస్కతిక సమితి అధ్యక్షులు తులసి నారాయణ నాయుడు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు మాట్లాడుతూ దాతలు శ్రీపురం సీతారామయ్య తన ఉదార భావనతో పిల్లలు భవిష్యత్తును ఆలోచించి సహాయం చేసినందుకు ఆయనకు కతజ్ఞతలు తెలియజేశారు. అలాగే విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని విద్యార్థులు భవిష్యత్తులో తమ ఉద్యోగాలకు నైపుణ్యం కూడా తోడ్పడుతుందన్నారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటే ఆరోగ్యవంతులుగా ఉంటారని అందుకే ప్రతి ఒక్క విద్యార్థి నచ్చిన క్రీడలలో నైపుణ్యాన్ని పెంపొందించి పాఠశాలతో పాటు వారి తల్లిదండ్రులకు పేరు గడించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీవో సస్పెన్షన్

ప్రజాశక్తి-గుడిపల్లి: ప్రభుత్వ పథకాల అమలులో అశ్రద్ధ, ఉద్యోగులతో సమన్వయం పాటించకపోవడం తదితర కారణాలతో మండల ఎంపీడీవో రమణయ్యను సస్పెండ్ చేసినట్లు ఉన్నత అధికారులు వెల్లడించినట్లు సమాచారం. ఎంపీడీవో వ్యవహార శైలి మార్చుకోవాలని గతంలో హెచ్చరించినా మారకపోవడంతో విధుల నుంచి తాత్కాలికంగా తొలగించి, ఆయన స్థానంలో ఈఓపీఆర్‌డీగా పనిచేస్తున్న శంకర్‌కు ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

విద్యతోనే ఉన్నత శిఖరాలు




ప్రజాశక్తి-బంగారుపాళ్యం: విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జయ చంద్ర నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని మడుపలూరు ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన జయచంద్ర నాయుడు విద్యార్థులకు ఉచితంగా విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో సమాజంలో గొప్ప పేరు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిఆర్‌పి సుధాకర్ శెట్టి, ప్రధానోపాధ్యాయులు అనిత తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ప్రతిభను గుర్తించేందుకే ఎస్ఎంసి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పిల్లల ప్రతిభను గుర్తించేందుకే ఎస్ఎంసి సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఎస్ఎంసి సమావేశం ప్రధానోపాధ్యాయులు ధనంజయ రాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ప్రతి త్రైమాసిక సమావేశానికి హాజరు కావాలని, దీంతో వారి పిల్లల ప్రతిభను ప్రత్యక్షంగా వీక్షించచ్చని అన్నారు. సర్పంచ్ ఉమాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పలు సంక్షేమ పథకాలు ప్రారంభించిందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ప్రజాశక్తి-పులిచెర్ల: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. కల్లూరు పోలీసుల కథనం మేరకు వివరాలు... రొంపిచెర్లకు చెందిన షమీ ఉల్లా, తన భార్య తస్లీమ్ (35) తో కలిసి మంగళవారం ఉదయం ద్విచక్రవాహనంపై కల్లూరుకి బయలుదేరారు. మార్గమధ్యలోని పులిచెర్ల ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో వస్తుండగా తస్లీమ్ ధరించిన బురఖా ద్విచక్రవాహనం వెనుక చక్రానికి తగిలి వాహనం బోల్తా పడింది. దీంతో తస్లీమ్ రోడ్డుపై పడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. షమీ ఉల్లాకు గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న కల్లూరు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కెంపె గౌడ జయంతి వేడుకలు



ప్రజాశక్తి-కుప్పం: కర్ణాటక రాష్ట్రానికి చెందిన కెంపెగౌడ 514 వ జయంతి వేడుకలను మంగళవారం ఒక్కిలిగ కులస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కిలిగ నియోజకవర్గ నాయకులు మాట్లాడుతూ కెంపె గౌడ చేసిన ఎనలేని సేవలను గుర్తు చేసుకుంటూ ఆయనకు ఘన నివాళులర్పిస్తూ ఆయన జయంతి వేడుకను పండుగ వాతావరణంలా నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు మండలాల్లోని కులస్తులు అందరూ ఐక్యంగా కుప్పం బస్టాండ్ పరిధిలో బహిరంగ సభ నిర్వహించి జయంతి వేడుకలు చేశారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ శ్రీనివాసులు, గుడిపల్లి మండలం ఒక్కిలిగ నాయకులు రాజగోపాల్, హేమంబర్ గౌడు, జడ్పిటిసి కష్ణమూర్తి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిపల్లి: కెంపెగౌడ జయంతి సందర్భంగా మంగళవారం కుప్పం నియోజకవర్గ కార్యక్రమానికి మండలంలోని ఒక్కిలిగ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని వారి ఐక్యతను చాటుకున్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ ఐకమత్యంగా ఉంటూ మన కులాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మండల ఒక్కిలిగ నాయకులు హేమాంబర్ గౌడు, డాక్టర్ ప్రశాంత్ కుమార్, ఏయం భూపతి, మాజీ ఎంపీటీసీ బాలచంద్ర పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ



ప్రజాశక్తి-పెనుమూరు: మండలంలోని లక్కలపూడివాండ్ల ఊరు, సాతంబాకం గ్రామ పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో నీలకంఠేశ్వర రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. దినసరి వేతనం ఎంత వస్తుందని కూలీలను అడిగి తెలుసుకున్నారు. రూ. 270 రూపాయలు దినసరి వేతనం వచ్చేలా పనిచేయాలని ఆయన కూలీలకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కూలీల సంఖ్య పెంచాలని ఆదేశించారు. మామిడి మొక్కల పెంపకం పనికి సంబంధించి ఈ నెలాఖరులోపు మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వించాలని జూలై 15 లోపు మొక్కలు నాటించడం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో గుణశేఖర్, డీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి గ్రస్తుల సర్వే పకడ్బందీగా చేపట్టాలి



ప్రజాశక్తి-నగరి: కుష్టువ్యాధి గ్రస్తుల గుర్తింపు సర్వే పకడ్బందీగా చేపట్టాలని బుగ్గఅగ్రహారం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ మంగళవారం అన్నారు. సర్వే చేపట్టాల్సిన విధానాలపై ఆయన వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. ఈనెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకు కుష్టువ్యాధి గ్రస్తుల గుర్తింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో ఉన్న ఇళ్లను ఆశాలు, వాలంటీర్లు పరిశీలించి ఎవరికైనా అనుమానాస్పద మచ్చలు ఉన్నాయా ఆ మచ్చలు ఉన్న వారిని కుష్టు వ్యాధి ఉందాలేదా అన్న అంశాన్ని నిర్ధారించడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలన్నారు. కార్యక్రమంలో ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లాలోని ఇంటర్మీడియట్ పూర్తిచేసుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివద్ధి సంస్థ, డిఆర్‌డిఎ, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌సిఎల్ టెక్‌బి ప్రోగ్రాం ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సు ఈ నెల 28న మధ్యాహ్నం 3 గంటలకు నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టెక్‌బి ట్రైనింగ్ ప్రోగ్రాం కాలపరిమితి ఒక సంవత్సరం ఉంటుందని విద్యార్థుల, వారి తల్లిదండ్రులకు ఈ ప్రోగ్రాంపై అవగాహనకి ఈకార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదన్నారు.

ఘనంగా మాతమ్మ జాతర

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని తగ్గువారిపల్లి పంచాయతీ ఆది ఆంధ్రవాడ గ్రామంలో మంగళవారం అంబలి పోసి, పొంగలి సమర్పించి మాతమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా మాతమ్మకు ప్రత్యేక పూజలు చేసి సుందరంగా అలంకరించారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వాసవి క్లబ్ మహిళా విభాగం నేతృత్వంలో మంగళవారం స్థానిక జైహింద్ పాఠశాల్లో విద్యార్థులకు విద్యాసామగ్రి తినుబండారాలను అందించారు. ఈసందర్భంగా వాసవి క్లబ్ మహిళా విభాగం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేదపిల్లలకు తమ వంతు సాయం చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం బాలసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు ముక్తార్ అహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.

